"కాలం మనుష్యుల్ని కరగించి
తనకి నచ్చిన మూసలో పోసి,
మనిషి రూపులో, బ్రతుకులో
మార్పులు తెస్తుంది."

# తాటాకుల మంట

బయట పండు వెన్నెల కాస్తుంటే సావిత్రమ్మ మనసు చీకటిలోకి ప్రయాణిస్తున్నది. గది బయట అడుగుల సవ్వడి విని ప్రక్కకి ఒత్తిగిలి నిద్రపోతున్నట్లు కళ్లు మూసుకుంది ఆమె. మెల్లగా ఆ గది తలుపు తెరుచుకొంది. కమ్మని ఖరీదైన సెంటు వాసనలు గది నలుమూలలా ఆవరించుకొన్నాయి.

"అమ్మ నిద్రపోతున్నట్లు ఉంది నాన్నగారూ! ఈ నెల రోజులుగా మా అందరి సదుపాయాలూ చూస్తూ చాలా అలసిపోయింది. టీ తీసుకొంటున్నప్పుడు ఈ రోజు వెళ్తున్నామని చెప్పాను. మరి ఇప్పుడు నేను లేపదలుచుకోలేదు. మీరు చెప్పండి. తన ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమనండి. ఈసారి తొందరలోనే తిరిగి వచ్చేందుకు ప్రయత్నిస్తాను. అన్నయ్య, వదినా సంక్రాంతికి వస్తామన్నారు. కోమల సంవత్సరాదికి వస్తుందిట. ఎవరో ఒకరం వచ్చి చూసిపోతూనే ఉంటాము. అనవసరంగా అమ్మని కంగారు పడవద్దనండి."

రమాకాంతరావు చెవుల్లో కొడుకు మాటలు జొరబడలేదు. ఎదురుగా మంచం మీద సన్నని దోమతెర వెనుకగా వడలిన పండు తమలపాకులా పడుకొని వున్న భార్యని చూస్తున్నాడు. నిజంగా సావిత్రి నిద్రపోతున్నదా? ఎంత కాలానికో వచ్చిన కొడుకు దేశం వదలి వెళ్లిపోతూంటే అంపకం పెట్టలేనంతగా అలసిపోయిందా? అనుకున్నాడు.

కోడలు గౌరవం నిండిన కళ్లతో అత్తగారిని చూస్తూ చేతులు జోడించి నమస్కరించింది.

"పదండి, మీకు వేళవుతుంది" అంటూ రమాకాంతరావు ముందుకి దారి తీశాడు.

తల్లివంక ఒక్కసారి నిదానంగా చూసి, అతి మెల్లగా తలుపు మూసి, తండ్రిని అనుసరించాడు కొడుకు.

వచ్చినవారు వెళ్లిపోయారన్న నమ్మకం కుదిరాక ఇటు తిరిగి, గుమ్మం వైపు చూసింది సావిత్రమ్మ. మూసి ఉన్న తలుపు ఆమె మనోవ్యథను అర్థంచేసుకొన్నట్లు సానుభూతిగా చూశాయి. పోర్టికోలో బయలుదేరి, హారన్ వేస్తూ రోడ్డుమీదికి దూసుకుపోతున్న కారు ధ్వని విని గట్టిగా నిట్టూర్చింది సావిత్రమ్మ.

పిల్లలు వస్తారంటూ ఎదురు చూసినన్ని రోజులు పట్టలేదు. రావడం, వెళ్లిపోవడం కూడా అయిపోయింది. అంతా వెళ్లిపోయారు. ఆఖరి కారు కూడా కదలిపోయింది.

తెల్లవారితే మళ్లా ఈ లంకంత కొంపలో తామిద్దరూ, మినుకు, మినుకుమంటూ ఏ క్షణంలోనైనా ఆరిపోనున్న దీపాల్లా సంచరించాలి. భయంకరమైన ఆ ఒంటరి తనాన్ని అనుభవించాలి. గుండెలు పిండే నిశ్శబ్దాన్ని చెవుల్లో నింపుకోవాలి. కాలు కదుపుతూంటే, ప్రతి అడుగుకీ ఏవో సంఘటనలు జ్ఞాపకం వస్తుంటే, దాటిపోయిన జీవితాన్ని తలచుకొని బాధపడుతూ, దాని పునరాగమనానికి కళ్లలో ఒత్తులు వేసుకు ఎదురుచూస్తూ జీవితం దొర్లించాలి.

సావిత్రమ్మ ఆలోచనలు ఫ్యాను గాలికి కదులుతున్న కిటికీ తెరలలా ఇటు అటు కదలసాగాయి. సావిత్రమ్మ వంటి తల్లులు కొందరే వుంటారు. ఆమెవంటి అదృష్టవంతులు మరీ అరుదుగా ఉంటారు. ఆమెకి అన్నీ ఉన్నాయి. అన్నిటితోపాటు, దేనికోదానికి కలతపడే హృదయం కూడా వుంది. అవాంఛనీయమైన వర్తమానం నుంచి తప్పుకొనేందుకు గతానికి పరుగులు తీసింది ఆమె మనసు. గతం అంటే మరీ ఏళ్లూ, పూళ్లూ నాటి సంగతి కాదు. ఆరునెలల నాటి ముచ్చట.

"సావిత్రీ నాకు అరవై ఏళ్లు నిండాయి. షష్టిపూర్తి చేసుకొందామా?" అన్నాడు రమాకాంతారావు. ఉదయం టిఫెను ముగించి కాఫీ తాగుతూ "ఎప్పుడో చేసుకోబోయే షష్టిపూర్తి మాట కేంగాని ఈ రోజు మీ పుట్టిన రోజు కదా! రండి నుదుట తిలకం దిద్ది, కర్పూర హారతి ఇస్తాను. కావాలంటే నలుగురు ముత్తయిదువులను పిల్చి సెనగలు, పళ్లు వాయనం ఇస్తాను" అంది సావిత్రమ్మ పరిహాసంగా.

రమాకాంతారావు మనసులో షష్టిపూర్తి ఉత్సవానికి వెనుక దాగిన ఉద్దేశం తెలియగానే ప్రాతఃకాలములో ఒక్కొక్క దళమూ విప్పుకొంటూ, ఆకులచాటు నుంచి తొంగి చూసే పచ్చ మందార పువ్వులా సావిత్రమ్మ ముఖం వికసించింది.

ముహూర్త నిర్ణయం జరుగగానే దేశం నలుమూలలా ఉన్న పిల్లలకి ఉత్తరాలు వెళ్లాయి. పై చదువుకోసం అమెరికా వెళ్లి అక్కడే ఉద్యోగం చేస్తూ ఉండిపోయిన నాలుగో కొడుక్కి, తన అమెరికన్ భార్యని కూడా వెంట తీసుకురమ్మని ప్రత్యేకమైన జాబు గాలిలో ఎగురుతూ ప్రయాణం మొదలు పెట్టింది.

ఇండియా ఫారెన్ సర్వీసులో ఉన్న భర్తతో దేశదేశాలు తిరుగుతున్న ఆఖరి కూతురు పద్మకి "తప్పక రావాలి సుమాఁ అల్లుణ్ణి కూడా వెంటబెట్టుకు రావా"లంటూ ఫర్మానా జారీ అయింది.

పది మంది పిల్లల తల్లి సావిత్రమ్మ. పద్మకి పెళ్లి చేసి అంపకం పెట్టడంతో గొడ్రాలులా అయిపోయింది. కూతుళ్లు అత్తవారిళ్లకి వెళ్లిపోతే, కొడుకులు ఉద్యోగాలంటూ బయటికి వడిచారు. మిగిలింది భార్యాభర్తలిద్దరూ. మూడంతస్తుల మేడ ఆ ముసలివాళ్లిద్దర్నీ చూసి జాలిగా ఒక్కొక్క తలుపు మూసుకొంది. నాలుగేళ్ల క్రిందట పద్మ పెళ్లి అయిపోయాక

మూసిన తలుపులు తుడుపులకీ, సున్నాలకీ తప్ప మళ్ళీ తెరచుకోలేదు.... ఒకరో, ఇద్దరో చుట్టాలు వచ్చినా క్రింది భాగంలో తగినంత స్థలం వుంది.

◆ ◆ ◆

ఒక్క నిమిషం కాలు, చెయ్యి ఆపకుండా, ఒక్కొక్క గదినే తన పిల్లల అభిరుచుల్ని, అలవాట్లనిబట్టి అలంకరిస్తున్నది సావిత్రమ్మ. పుట్టినప్పటినుంచి పూరేకుల్లా నౌకర్లందరూ పరివేష్టించి ఉన్నా స్వయంగా ఆ పని చేయడంలో ఉన్న ఆనందాన్ని ఆమె విడనాడుకోలేకపోయింది.

నాలుగో కొడుకు గది అలంకరిస్తుంటే విదేశస్థురాలైన కోడలు పిల్ల ఆమె మనసులో మెదిలింది. ఆ జీవితానికి అలవాటుపడిన కొడుకు కళ్ళముందు కదలాడు. ఈ గదిని ఎలా సరిదిద్దను? వారి అవసరాలు, అలవాట్లు ఎలా ఉంటాయో నా కెలా తెలుస్తుంది? ఇక్కడ ఉండే నాలుగు రోజులు నీటిలోంచి తీసి ఒడ్డున వేసిన చేపల్లా వాళ్ళు గిలగిల కొట్టుకొంటే ఎంత వ్యగ్రతగా ఉంటుంది అనుకొంది.

ఏమి చెయ్యాలో, ఏమి మానాలో తెలియక రెండు చేతుల్లో తల పట్టుకొని కూర్చుండి పోయింది సావిత్రమ్మ.

"దీనికోసం అంత కంగారెందుకు సావిత్రీ! నీకుతోచిన విధంగా నువ్వు ఏర్పాట్లు చెయ్యి కాదంటే వాళ్ళు వచ్చిన విధంగా మార్పులు చెయ్యవచ్చు" అన్నాడు రమాకాంతరావు.

"అది కాదండీ, పిల్లడు ఇంతకాలానికి వస్తున్నాడా? కడుపున పుట్టిన పిల్లడికి ఏం కావాలో నేను ఊహించలేని పరిస్థితిలో ఉండిపోయాను చూడండి. జీవితంలో ఎప్పుడైనా ఆ దేశాలన్నీ ఒకసారి తిరిగివస్తే ఈ పరిస్థితి కలిగేదికాదు. ఏమిటో నా దేశం నలుమూలలు చూసివస్తే అంతే చాలనుకొన్నాను కానీ...."

కొడుకు అలవాట్లు తెలుసుకొనేందుకు దేశాలు చూసి రాలేదని బాధపడుతున్న ఆ తల్లివైపు వింతగా చూశాడు రమాకాంతరావు. "పోనీలే సావిత్రీ! నీ స్నేహితురాలు పద్మజ ఆ మధ్య నెప్పుడో అమెరికా వెళ్ళి వచ్చిందని చెప్పావుకదూ. ఆమెని పిలిచి నీ కొడుకు గది ఎలా ఉంటే బాగుంటుందో అడిగి చూడు."

ఒక్కసారిగా, అరవై ఏళ్ళు నిండిన భర్తని అమాంతం కౌగిలించుకొన్నంత పనిచేసిది సావిత్రమ్మ.

"సరిగా సమయానికి ఎంత చక్కని సలహా ఇచ్చారండి" అంది సంతోషంగా.

"మరి నా సలహాకి ఫీజ్?" అన్నాడు రిటైర్డ్ హైకోర్టు అడ్వకేటు రమాకాంతరావు.

"పెళ్లాం దగ్గర కూడా ఫీజు వసూలు చేస్తారా? ఇంతకీ ఏం కావాలేం" నవ్వుతూ ప్రశ్నించింది సావిత్రమ్మ.

"నువ్వు" అన్నాడు కొంటెగా చూస్తూ రమాకాంతరావు.

"ఛీ.... చిలిపితనం. కాబోతున్న కార్యం పునస్సంధానం అనుకొన్నారేమిటి? షష్టిపూర్తి" అంది చురుకుగా చూస్తూ సావిత్రమ్మ.

"చిలిపితనం కాదు సావిత్రీ. నాకు కావలసింది నువ్వే. నీ ఆరోగ్యం తిన్నగా చూసుకోవడమే నాకు ముఖ్యం. కొడుకులు, కూతుళ్లు ఈ రోజు వచ్చి రేపు వెళ్లిపోతారు. వాళ్లకోసం నువ్వు ఇంత హైరానా పడుతూ ఒళ్లు అలసట పెట్టుకోడం నాకు నచ్చలేదు. ఏమైనా చెయ్యవలసిన ఏర్పాట్లు ఉంటే నౌకర్లకి చెప్పి, చేయించు. అంతేకాని, ప్రతి పనీ నీ చేతిమీదుగా జరగాలంటూ ఇలా సతమతమవడం నాకు బాగా లేదు. అసలు నువ్వు ఇంత హంగామా చేస్తావంటే ఈ మాటే తలపెట్టకపోదును. ఏదో చాలా కాలంగా నలుగురూ కలియలేదు. ఇంక మనం చెయ్యబోయే కార్యాలు, కథలు కూడా లేవు. ఇదొక నెపంగా కొన్నాళ్లపాటు అంతా కలసి ఉంటారనుకొన్నాను కాని...."

"నా కోసం మీరేం కంగారుపడకండి. ఈ ఐదు నెలలుగా నా మనసు ఎంత సంతోషంగా ఉందో చెప్పేందుకు అలవికాకుండా ఉంది. మీరు కల్పించిన ఈ అవకాశం నా జన్మ కో పర్వదినం. మీరేం కాదనకండి. మళ్లా నా పిల్లలకి నా చేతులతో చేసుకొనే సమయం ఉంటుందో ఉండదో" అంది.

సావిత్రమ్మకి పిల్లలపట్ల ఉండే మమతానురాగాలు రమాకాంతరావుకి తెలియనివి కావు. ఆమె వారికోసం ఎంత శ్రమైనా పడేందుకు వెనుతీయదు. విషయం తెలిసి వున్నా ఆమె ఆరోగ్యం పురస్కరించుకొని అతను హెచ్చరిక చెయ్యక తప్పిందికాదు. ఆమె వింటుందన్న నమ్మకం లేకపోయినా.

అదిగో. ఇదిగో అని ఎదురు చూసిన రోజులు దగ్గరపడ్డాయి. పిల్లలంతా దూరాన్ని దబ్బితోనెట్టి తల్లి దగ్గరికి చేరుకొన్నారు. సావిత్రమ్మకి కొడుకులు, అల్లుళ్లు అన్న భేదం లేదు. అందర్నీ అబ్బాయి, నాయనా అంటూనే పిలుస్తుంది. అదే అభిమానంతో, వాత్సల్యంతో చూస్తుంది. అలాగే ఆమె కోడళ్లని, కూతుళ్లని విడమరచి చెప్పడం కష్టం. అంతా ఆమెని 'అమ్మా' అనే పిలుస్తారు. ఒక మాటలో చెప్పాలంటే సావిత్రమ్మ ఆ ఇంటిలో అందరికీ అమ్మ. ఇంటి యజమాని మొదలుకొని ఇల్లు తుడిచే నౌకరు కుర్రాడు వరకు అందరికి ఆమె మాట శిరోధార్యం. ఆ గౌరవం ఆమె ఆ ఇంటి కొత్త కోడలుగా కాలు పెట్టిననాడే హస్తగతం చేసుకొంది. నేటివరకు దానిని చేయిజారనీయలేదు.

పెరిగి పెద్దవారైన పిల్లలకి, వయసు మీరుతున్న తలిదండ్రులకి మధ్యనున్న ఈ అనుబంధాన్ని, బాంధవ్యాన్ని కళ్లింతలుగా చేసుకొని చూసేది సావిత్రమ్మ నాలుగవ కోడలు ఎమిలీ, పెళ్లయిన కొడుకు తలిదండ్రుల ఇంటికి అతిథిగా వెళ్లే సంస్కృతిలో పుట్టి పెరిగిన ఆ పిల్లకి ఈ మమతానురాగానికి మూలం ఎక్కడుందో మనస్సుకి అందేదికాదు.

అరవై ఏళ్లు నిండిన మామగారి కళ్లలో వెలుగుతూండే కాంతులకు, పదిమంది పిల్లల్ని కని, వ్యక్తిగతం జీవితం అంటే ఏమిటో మరచిపోయిన భార్యపట్ల అతను చూపుతున్న ప్రేమాభిమానాలకి అసలు కీలకం ఎక్కడుందో ఆ పిల్ల ఊహించుకో లేకపోయింది.

శుభముహూర్తాన పీటలమీద కూర్చున్న దంపతులను పెద్దలు అనేకవిధాల ఆశీర్వదిస్తూ కానుకలు అందించారు. బంధువులు, స్నేహితులు ఇస్తున్న కానుకలను ఈ చేత అందుకొంటూ, ఆచేత తమ హోదాకి తగినట్లుగా వారిని సత్కరిస్తూ, కొత్త బట్టలు పెట్టి గౌరవించారు రమాకాంతరావు, సావిత్రమ్మా.

వచ్చినపని పూర్తి అయ్యాక పిల్లల ఆలోచనలు, మాటలు తమ ఇళ్లవైపు మళ్లాయి. మధ్యాహ్నం భోజనాలు పూర్తి అయ్యాక అంతా ఒకచోట చేరి ఎవరు ఎప్పుడు వెళ్లాలి? ఎలా వెళ్లాలి? అనే విషయాలు చర్చించుకొంటున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఇరవై మంది యువతీయువకుల మధ్య ఉండే ఆప్యాయత, స్వాతంత్ర్యము వారి మాటల్లో ప్రస్ఫుటము అవుతున్నది. హాస పరిహాసాలతో ఆ హాలంతా ప్రతిధ్వనిస్తున్నది. అన్నివిధాలా పెరిగి పెద్దవారైన తన సంతానాన్ని తృప్తిగా తిలకిస్తూ సోఫాకి చేరబడి చేతిలోని పైపుతో టొబేకో మేఘాలు సృష్టిస్తున్నాడు రమాకాంతరావు.

మెల్లగా తేలిపోతున్న ఆ పొగ వెనుక లీలగా కన్పిస్తున్న తమ పెళ్లినాటి ఫోటో వంక చూశాడు రమాకాంతరావు. ఐదడుగుల ఎత్తుతో, ప్రపంచంలోని సిగ్గంతా ముద్దచేసి నిల్చినట్లు తను కూర్చున్న కుర్చీ అంచుని చేయిపెట్టి ఫోటోగ్రాఫర్ అభ్యర్థనపై తప్పనిసరిగా ముఖమెత్తి బిత్తరచూపులు చూస్తున్న సావిత్రిపై అతని చూపులు నిలిచాయి.

పదహారేళ్లు నిండని ఆ ముగ్ధ ఈనాడు పదిమంది పిల్లలతల్లిగా, పెద్దింటి గృహిణిగా, అనుకూలవతియైన భార్యగా మారిపోయింది. కాలం మనుష్యుల్ని కరిగించి తనకి నచ్చిన మూసలో పోసి, మనిషి రూపులో, బ్రతుకులో మార్పులు తెస్తుంది. మనసు మెత్తని వారిలో ఆ మార్పులు మరీ హత్తుకొన్నట్లు కన్పిస్తాయి. కష్టసుఖాలకి ఇట్టే కరగిపోతారు. సావిత్రి కూడా ఆ కోవకి చెందిందే అనుకొన్నాడు అతడు.

భార్యమీదకి ఆలోచనలు మళ్లగానే ఆమె ఆ చుట్టుపక్కలలేనట్లు గుర్తించాడు రమాకాంతరావు.

"మీ అమ్మేది పద్మా?" అంటూ కూతుర్ని ప్రశ్నించాడు.

"అదే నేనూ అనుకొంటున్నాను నాన్నగారూ! అంతా ఇక్కడ ఉంటే, ఒంటరిగా తమ ఇంట్లో ఏం చేస్తున్నది?" మాట ముగిస్తూనే పద్మ తల్లికోసం లోపలికి వెళ్లింది.

పద్మ హాలు గుమ్మం దాటకముందే, చేతిలో ఒక మంచి గంధపు నగిషీ పనిచేసిన కర్రపెట్టితో హాలులోకి వచ్చింది సావిత్రమ్మ. ఆమె ముఖం పీక్కుపోయి, పది లంఖణాలు చేసినట్లు వుంది. నెల రోజులుగా మిలమిల మెరుస్తున్న ఆమె కళ్లలోని తళుకు కరిగిపోయింది.

"ఏం అమ్మా, అలా ఉన్నావు? ఒంట్లో సరిగాలేదా?" పెద్ద కొడుకు తల్లి చెయ్యి పట్టుకొని పక్కన కూర్చోపెట్టుకొంటూ ఆత్రంగా అడిగాడు.

"అబ్బే ఈనెల రోజులై మాకోసం శక్తికిమించి శ్రమపడ్డావు. అన్నిటికీ పనివాళ్లు ఉన్నారు కదమ్మా, నీకెందు'కంటే ఊరుకోవు. మేమింత ముందుగా రాకపోవలసింది" అన్నాడు రెండో కొడుకు.

"అదేం మాట రామూ! చెట్టు కాయలు చెట్టుకి బరువా? ఎవరో పైవారికోసం చేసినట్లు అలా అంటారు మీరు. ఈ నెల రోజులు ఇల్లంతా కలకలలాడుతూ ఎంత సందడిగా ఉంది?"

"ఏం సందడో, పిల్లలంతా నాన్నమ్మ, అమ్మమ్మ అంటూ ఆవిడని ఒక్కలా ఊదరకొట్టారు. తెల్లవారక ముందే ఆవిడ పక్క మీదికి చేరి నానా హంగామా చేస్తూ ఒకటే అల్లరి. మొన్నటికి మొన్న మూడుసార్లు కాఫీట్రే పంపినా ఆవిడని ఒక్కగుక్కెడు కాఫీ గొంతుకలో పోసుకోనీకండా అంతా వాళ్లే పూర్తిచేసారు."

"ఒక్క కాఫీ అన్నమాటేమిటి వదినా! ఒక పండో ఫలహారమో తిన్న పేరు అమ్మది, ఫలితం పిల్లలిది."

"అమ్మ మీదికి దండయాత్రలా మీరు పిల్లల్ని ఎందుకు పంపుతారు!" మూడో కొడుకు మందలించాడు.

"మేము ప్రత్యేకం పంపేదేమిటి? ఆవిడ పిలుస్తారు. వీళ్లు పరుగులంకించు కొంటారు" కోడలు సమాధానం చెప్పింది.

"పోనీండ్రా! పిల్లల్ని ఎందుకలా ఆడిపోసుకొంటారు? ఈ నాలుగు రోజులేకదా – ఎంత వాళ్లు నాదగ్గర అల్లరిచేసినా, నేను ముద్దుచేసినా, ఇంక రేపు మీరంతా వెళ్లిపోతే... మళా..."

సావిత్రమ్మ మాట పూర్తి చెయ్యలేకపోయింది. ఆమె కళ్లల్లో ఆ ఒంటరి జీవితం పీడకలలా నిల్చింది. అంతలోనే కళ్లు తుడుచుకొని, చేతిలోపెట్టి మధ్య టేబిలు మీద పెట్టి, మూత తెరచింది.

అత్తింట, పుట్టింట ఆమె చిన్న నాటినుండి పెట్టుకొన్న నగలు అందులో వున్నాయి. తులమెత్తు బంగారం ఉన్న ఉంగరం నుంచి, వేలకి వేలు ఖరీదుచేసే రవ్వల, కెంపుల పతకాలూ, మంచి ముత్యాల ముప్పేట సరాలు, పచ్చల వంకీలు, పగడాలు తాపిన వడ్డాణం మొదలైనవన్నీ అందులో వున్నాయి.

ఆ సమయంలో వాటిని ఆమె ఎందుకు తీసిందో ఎవరికీ అర్థం కాలేదు. చిన్న వదినగారికి భారత స్త్రీల అలంకారాలు చూపించడానికి తెచ్చి వుంటుందని భావించింది పద్మ.

ఒక్క లిప్తకాలం సావిత్రమ్మ భర్తవైపు చూసింది. అటునుండి ఏ సంకేతం అందిందో మరి – అంతలోనే తృప్తిగా మెరిసాయి ఆమె కళ్లు. ఒక్కొక్క వస్తువునే బయటికి తీసి టేబిలు మీద పెడుతూ "ఇందులో ఎవరి కేమి కావాలో చూసుకొని తీసుకోండి" అంది.

"అదేమిటమ్మా! మాకు పెట్టిన నగలు మాకుచాలవా? ఈ నగలు నీ జీవిత పర్యంతం నీదగ్గరే ఉండనీ" అంది పెద్దకూతురు.

"నా దగ్గర ఇలా పెట్టిలో పడి వుంటే ఏమిటి ఉపయోగం జానకీ? నాచేతులతో నా పిల్లలకి ఇచ్చుకొన్నానన్న తృప్తి నాకు దక్కనీండి. నామాట కాదనకండి" అంది ఆప్యాయంగా.

ఆ పురాతన ఆభరణాలను ఎంతో కుతూహలంగా చూసింది ఎమిలీ. వాటి పేర్లు, అవి అలంకరించుకొనే విధం వివరంగా అడిగి తెలుసుకొంది. ఒక్కొక్క వస్తువునే తీసి అలంకరించుకొని, అద్దంలో చూసుకొంది. వాటి పనివాడితనానికి మెప్పుదల కనపరచింది.

ఒక్క ఎమిలీ తప్ప, మిగిలిన కూతుళ్లు, కోడళ్లు ఏవో తమకి నచ్చినవి తీసుకొన్నారు. సావిత్రమ్మ ఈ విషయం గమనించింది.

"పద్మా! చిన్న వదిన ఏమీ తీసుకోలేదు. ఆమె కేం కావాలో అడిగి తెలుసుకో అమ్మా" అంది కూతురితో. సావిత్రమ్మకి ఇంగ్లీషు మాట్లాడ్డం రాదు. ఎవరైనా మాట్లాడుతే కొద్దికొద్దిగా అర్థం చేసుకోగలదు. అదికూడా వినికిడిమీద నేర్చిందే.

ఆ నెలరోజుల్లో ఎమిలీ చిన్న చిన్న తెలుగు పదాలు నేర్చుకుంది. అన్నిటిలోకి ఆమెకి ఇష్టమైన పదం "అమ్మ". పిల్లలంతా సావిత్రమ్మని 'అమ్మా' అని పిలుస్తుంటే నాలుగురోజులనాటికి తనూ ఇలా పిలవడం నేర్చుకొంది. పరాయిదేశపు పిల్ల అంత ఆప్యాయంగా అమ్మా అని పిలుస్తుంటే సావిత్రమ్మకి ఎంతో ఆనందంగా ఉండేది. తన కొడుకు విదేశస్థురాలిని పెళ్లి చేసుకొంటున్నాడని తెలిసిననాడు ఆ కోడలు ఈ కుటుంబంలో వేరుగా నిలిచిపోతుందేమో అని సంశయించింది సావిత్రమ్మ. కాని, ఎమిలీ స్నేహవర్తన, నిర్మల హృదయం చూశాక ఆమె మనసుకి తృప్తికలిగింది.

ఎమిలీకి అచిరకాలంలోనే అత్తగారిపట్ల అమితగౌరవం, అభిమానం కలిగాయి. ఏకాంత సమయంలో భర్తతో ఆమాటే అంది. "మీ అమ్మగారు ఎంత మంచివారు" అంది.

తల్లిమాటని ఇంగ్లీషులోకి తర్జుమాచేసి వదినగారికి తెలియజేసింది పద్మ. సావిత్రమ్మ ఆప్యాయంగా తీసుకో అన్నట్లు పెట్టివైపు చూపించింది. ఎమిలీ ఏదో అంటూ 'ఒద్దు' అన్నట్లు బుర్రాడించింది.

"ఏమంటుంది? ఈనగలు తనకి నచ్చలేదా? చూడు, ఆ వ్రజపు టుంగరం ఆ పిల్ల వేలుకి ఎంతో బాగుంటుంది" అంది, సావిత్రమ్మ.

"అది కాదమ్మా, వదిన కివేమీ అక్కరలేదుట. నువ్వింకా ఏదో దాచుకొన్నావుట. అది ఇస్తే కావాలంటున్నది."

"నే నింకేం దాచుకోలేదమ్మా. ఈ మంగళసూత్రాలు తప్ప" అంది సావిత్రమ్మ నెమ్మదిగా.

తల్లి మాట్లాడిన తీరులోని మార్పు గమనించాడు చిన్న కొడుకు - తన భార్య మాటతో తల్లి మనసు గాయపడిందని తెలుసుకొన్నాడు.

"అమ్మ బాధపడుతుంది. ఏదో ఒకటి తీసుకో ఎమిలీ" అని మెల్లగా భార్యతో చెప్తూ, "నీ కోడలు పరిహాసానికి అంటున్నాదమ్మా" అన్నాడు తల్లితో.

"ఆమె దగ్గరినుంచి ఎంతో విలువైన వస్తువుని నేను పొందాలనుకొంటున్నాను. స్వయంగా అడిగి తీసుకొంటానని మీ అమ్మతో చెప్పండి" అంది ఎమిలీ.

మరునాడు తెల్లవారిన దగ్గరినుంచి కొడుకులు, కూతుళ్లు ఒకరొకరే ప్రయాణాలు మొదలుపెడుతారు. నెలరోజులై చిరునవ్వులు చిందిస్తున్న ఆ సౌధం ఒక్కసారిగా మూగపోతుంది. పోర్టికోలోంచి ఒక్కొక్క కారే కదలిపోతూంటే పై అంతస్తులోని ఒక్కొక్క తలుపే మూసుకుపోతుంది. తిరిగి అవి తెరవబడడం తను చూడకపోవచ్చు. ఇంతమందీ ఒక్కసారిగా కలసే అవకాశాలు ఇంకలేవు. ఇదే పక్షులు నిండి వున్న ఈ వృక్షం పచ్చగా కన్పించే చివరిరోజు. మరునాటికి పక్షులన్నీ ఎగిరిపోతాయి. ఆకులన్నీ రాలిపోయి మోదులా మానుమాత్రం నిలచి ఉంటుంది అనుకొంది సావిత్రమ్మ, భర్త గదిలోంచి పైకివస్తూ.

రమాకాంతరావు ఆమె మనసు ఉత్సాహపరచేందుకు ఎన్నో కబుర్లు చెప్పాడు. "పిల్లలు రాలేకపోతే మనమే వాళ్ల దగ్గరికి వెళదాం" అన్నాడు. "ఆ సాకుతోనైనా నాలుగు స్థలాలు చూసినట్లు అవుతుంది. నీ వింతగా బెంగపడేందుకు ఏమీ లేదు" అంటూ నచ్చ చెప్పాడు.

కాని సావిత్రమ్మకి తెలుసు, తనుకాని, భర్తకాని ఆ ఇంటి నాలుగు గోడలుదాటి బైటికివెళ్లి నాలుగు రోజులైనా ఉండలేరు. ఆ వెలుగు, ఆ గాలి, ఆ పరిసరాలు వారి జీవితంలో అంతగా పెనవేసుకుపోయాయి. వచ్చునా, బ్రతికి వున్నా సడలిపోని అనుబంధం వారికి ఆ గడ్డతో ఉంది.

వరండాలోకి వచ్చిన సావిత్రమ్మకి ఎదురుగా హాలు గుమ్మందగ్గర ఎవరో తచ్చాడుతున్నట్లు అనిపించింది. పిల్లలంతా భోజనాలు పూర్తి చేసుకొని తమ గదుల్లోకి వెళ్లిపోయారు. నౌకర్లు కూడా పనిపాట్లు పూర్తిచేసుకొని వెళ్లిపోయారు. మరి అక్కడ ఆ నీడలో ఉన్న వ్యక్తి ఎవరు? మెల్లగా అడుగులువేస్తూ అటువైపు వెళ్లింది సావిత్రమ్మ.

ఆమె తన వైపు రావడం చూసి నీడలో నుండి ముందుకు వచ్చింది ఎమిలీ. ఆ నీలంలైటు కాంతిలో నీలాకాశంపై పల్చగా సాగుతున్న తెలిమబ్బులోనుంచి తళుక్కున మెరసిన నక్షత్రంలా ఉంది ఆమె.

'ఎవరది? ఎమిలీ' అంది సావిత్రమ్మ.

ఆమె మాట అర్థం కాకపోయినా తన పేరు ఉండడంవల్ల తనని ఉద్దేశించి ఆ మాట అన్నదే అని ఎమిలీ గ్రహించి 'అమ్మా' అంది.

'ఇక్కడ ఏమి చేస్తున్నావు తల్లీ!' కళ్లతోనే ప్రశ్నించింది సావిత్రమ్మ.

ఎమిలీ తను అడగదలుచుకొన్న నాలుగు మాటలు అత్తగారి కళ్లలోకి చూస్తూ, ప్రతి పదానికి ఆపుతూ, ఆమెకి అర్థం అయేలా ప్రశ్నించింది.

'ఇంత వయసుమీరి, ఇంతమంది పిల్లల్ని కని కూడా భర్తకి అంత ఆకర్షణీయంగా మీరు ఎలా మసలుకోగలుగుతున్నారు? ఆయన అనురాగాన్ని, ప్రేమని చెక్కుచెదరకుండా ఇంతకాలం ఎలా అరికట్టుకోగలిగారు? కూతుళ్ల, కొడుకుల ఆదరాభిమానాలేకాక అల్లుళ్ల, కోడళ్ల గౌరవాభిమానాన్ని కూడా ఎలా పొందగలుగుతున్నారు? నెల రోజులుగా చూస్తున్నాను. మీలో ఏదో మంత్రశక్తి ఉంది. ఏదో వశీకరణ శక్తి వుంది. ఇందరి ప్రేమాభిమానాల్ని వశం చేసుకొన్న ఆ శక్తి ఏమిటో నాకు తెలుసుకోవాలని వుంది. ఇంతకు పూర్వం మీరు దాచుకొన్నారని నేను చెప్పిన అమూల్య ఆభరణం ఇదే. దానిని నా కిప్పించండి అమ్మా!' అంది ఎమిలీ నెమ్మదిగా.

సావిత్రమ్మకి ఎమిలీ చెప్పినదంతా అర్థం కాలేదు. మాటల అర్థం భాషరానందున సరిగా తెలియకపోయినా, ఆమె భావాల్ని మాత్రం ఆమె కళ్లల్లోంచి పూర్తిగానే అందుకొంది.

ఎమిలీ అడిగిన ప్రశ్న సావిత్రమ్మ మనసులోకి ఏనాడూ రాలేదు. దానికో సమాధానం ఉంటుందని కూడా ఆమెకి తెలియదు. ఈ ఫలితంకోసం ప్రత్యేకించి ఆమె చేసింది ఏమీ లేదని ఎలా చెప్పడమో, ఏమి చెప్పడమో ఆమెకి తెలియలేదు.

ఎంతో ఆప్యాయంగా, మృదువుగా ఆ కోడలు పిల్లని దగ్గరికి తీసుకొని నుదుటిపై ముద్దు పెట్టుకొంది. 'నీ మంచి మనసే నీకు సుఖశాంతుల్ని ఇస్తుందమ్మా. నీ జీవితం నిర్మలంగా గడచిపోతుంది' అని మనసులోనే దీవించింది సావిత్రమ్మ.

అత్తగారి స్పర్శ ఎమిలీకి ఏమి సందేశాలు అందించిందో? తను కోరిన కోరిక లభ్యమయిందన్నంత సంతోషంగా రెండు చేతులు జోడించి నమస్కారం చేసి వెళ్లిపోయింది.

"ఎక్కడికి వెళ్లావు ఎమిలీ?" భర్త ప్రశ్నించాడు.

"అమ్మ దగ్గరికి నే కోరుకొన్న వస్తువు తీసుకొనేందుకు" అంది చిరునవ్వు నవ్వుతూ.

"ఏదీ చూపించు, అంత రహస్యంగా అమ్మ నుంచి నువ్వు తీసుకొన్న వస్తువేమిటి? నీ కోసం ఆమె దాచిన అంత విలువైన వస్తువు ఏమిటి?"

"అది మా ఇద్దరిమధ్య నిలిచిపోవాలి. ఆమె నుండి నేను పొందిన దేమిటో తెలియచెప్పేశక్తి నాకు లేదు. బహుశా చెప్పినా మీరు అర్థం చేసుకోలేరు" అంది ఎమిలీ.

ఆ రాత్రి అత్తగారికి నమస్కరించి వెళ్లిపోతుంటే తను భారతదేశం వచ్చి ఏదో లబ్ధి పొందానన్న భావం ఆమె మనసులో నిల్చిపోయింది.

◆ ◆ ◆

వీధి తలుపువేసిన చప్పుడు, ముందు హాలులో బరువుగా పడుకున్న భర్తపాదాల అలికిడి వింటూ గట్టిగా కళ్లు మూసుకొంది సావిత్రమ్మ. ఏదో ఆవేశం ఆమె నరనరాల్లో

ప్రవహించి ఆమె మనసులో మంటలు పెట్టింది. ఒక్కసారిగా పక్కమీదనుంచి లేచి గదిలో ఇటు అటు పిచ్చిగా తిరుగసాగింది.

ఈ రాత్రి తెల్లవారకూడదు. ఈ చీకట్లో తను మునిగిపోవాలి. ఈ మధుర స్మృతులు మరుగుపడక ముందే ఈ జీవితం ముగిసిపోవాలి. ఈ లంకంత కొంపలో, ఏ చిరుగాలికైనా ఆరిపోయే దీపంలా తను బ్రతుకలేదు. పక్షులు ఎగిరిపోయి వెలితిగా మిగిలిన చెట్టులా... ఆకులు రాల్చిన మోడులా తను బ్రతుకలేదు. 'భగవంతుడా!' తిరిగి ఆ ఒంటరి జీవితంలోకి తను ప్రయాణించలేదు. 'ఈ కళ్లు శాశ్వతంగా ఇలా మూసుకుపోనీ తండ్రీ....'

నెలరోజులుగా మరచిపోయిన నిద్రమాత్రల సీసా చేతిలోకి తీసుకొంది. అందులో చాలానే వుండాలి. ఎన్ని ఉన్నాయో ఆమె గుర్తించలేదు. ఎన్ని మింగిందో కూడా లెక్కించలేదు. గ్లాసుతో నీళ్లు తాగి పక్కమీద వాలిపోయింది. ఆమె కళ్లు మూతలు పడుతూంటే భర్త ముఖం కళ్ల ముందు కన్పించింది.

'భగవంతుడా, నే నేం చేశాను? నే నేం తిన్నాను' అంటూ మత్తుగా వాలిపోయింది.

◆ ◆ ◆

కిటికీ అద్దాల్లోంచి వెచ్చని ఎండ ముఖంమీద పడడంతో సావిత్రమ్మకి తెలివి వచ్చింది. కిటికీ అంచున తొట్టిలో పెట్టిన గుల్‌షబ్ మొగ్గల గుత్తిలో మొదటిపువ్వు వికసించి కిలకిల నవ్వుతున్నది.

పదిలంగా డ్రాయరు సొరుగులో దాచిన స్లీపింగు పిల్సును ఖాళీ సీసాలోకి పోస్తూ "లేచావా సావిత్రీ, ఇంక అమ్మగారు లేవలేదని రాములు చెప్తే చూసిపోదామని వచ్చాను" అన్నాడు రమాకాంతరావు.

సావిట్లో గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

"చాలా వేళయిపోయిందే. మీ స్నానం. పూజా అయిపోయేయా?" తొట్రుపడుతూ లేచి కూర్చుంది సావిత్రమ్మ.

నౌకరు తెచ్చిన ట్రేలో కప్పు తీసి కాఫీ కలిపి సావిత్రమ్మ చేతికి అందించాడు రమాకాంతరావు.

"మీ కెందుకు ఆ శ్రమ? నేను తీసొంటాను" భర్తని వారించింది సావిత్రమ్మ.

తను కూడా కాఫీ కప్పులో పోసుకొంటూ "పంచదార సరిపోయిందా?" అని ప్రశ్నించాడు రమాకాంతరావు.

"ఓ, కాఫీ దివ్యంగా వుంది" నెమ్మదిగా వేడి కాఫీని రుచి చూస్తూ అంది సావిత్రమ్మ.

"అబ్బా! నెలరోజు లైందనుకొంటాను, వేడివేడి కాఫీని ఇంత తృప్తిగా తాగి, ఎన్నిసార్లు తాగుదామని కప్పులో పోసుకొన్నా ఎవరో ఒకరు తయారయేవారు. తెల్లవారింది మొదలు ఇల్లు తీసి పందిరివేస్తూ ఎంత అల్లరి చేసేవారు పిల్లలు.

"ఈ నెలరోజులలో ఒక్క పుస్తకం చదవలేదంటే నమ్మండి. అంటుకట్టిన ఆ గులాబిల్ని కోసి పాతించేందుకైనా తీరిక లేకుండా పోయింది.

"చలికాలం తోసుకొస్తున్నది. మీ కోసం మొదలుపెట్టిన మఫ్లరు అర్థాంతరంగా అలాగే పడి ఉండిపోయింది."

ఇంకా తనుచెయ్యవలసిన పనుల గురించి, ఈ నెలరోజులుగా ఇంట్లో వచ్చిన మార్పువల్ల ఆలోచించని విషయాలగురించి నోరుమూయ్యకుండా మాట్లాడేస్తున్నది సావిత్రమ్మ.

రమాకాంతరావు గదిలో ఇటు అటు పచార్లుచేస్తూ కిటికీగుండా తోటలోకి చూశాడు. ఎదురుగా రాముడికొడుకు ఎనిమిది ఏళ్లవాడు జామికాయలకోసం కాయకి గురిచూసి ఒక రాయి విసిరాడు. అది గురితప్పి పక్కనే వున్న చిన్నకొలనులో పడ్డది. నిశ్చలంగా ఉన్న నీళ్ల ఒక్కసారి కళవళపడి నెమ్మదిగా సర్దుకొన్నాయి.

అతడు తిరిగి చూసేసరికి సావిత్రమ్మ గదిలోంచి వెళ్లిపోయింది. ఇంట్లో పనివాళ్లకి తోటమాలికి ఆజ్ఞలు జారీచేస్తున్నది. రాముడి పెళ్లాం తన మామ మీద ఏదో ఫిర్యాదు చేస్తూ "చూడండి అమ్మా" అంటున్నది.

"బండి గాడిలో పడింది" అనుకొన్నాడు రమాకాంతరావు.